

శ్రీపతి

రాత్రి భోజనానికి బసవరాజా ఆ ఇరుకు వీధిలోంచి పోతుంటే సరిగ్గా రాందాసు ఇంటిముందు ముగ్గు రొచ్చి ఎదురుగా అడ్డంగా నుంచున్నారు. ఐదుగు రయ్యారు. పదిమందయ్యారు. వాళ్ళంతా రైతులు. చుట్టుము ట్టారు. ఒక్కడూ మాట డ్డంలేదు. వాళ్ళ మనసుల్లో ఎంతటి క్రూరభావాలున్నాయో ఆ నిశ్శ బ్దమే చెపుతోంది.

ఆరోజు మరికొంచెం ఎక్కువ చీకటిగా ఉంది అసలే వర్షాకాలం. అందులోనూ తూర్పు కనుమల వడ్డునున్న వూరు. పైన ఆకాశంలో మేఘాలు. అంచేత మరింత దట్టంగా చీకటి.

అవూర్లో యింకా ఆముదపు దీపాలే. హరికెన్ లాంతర్లు వున్నా అవి బయటికి కనిపించవు. లోప లెక్కడో ఉంటాయి. ఇళ్ళ ముందు పశువుల పాలలు. అమురికి. ఆకంపు. దోమలు. ఇరుకు ఇళ్ళు. గాలీ వెలు తురూ వుండని బతుకు. మంచిగుడ్డలు వేసుకోరు, ఆడవాళ్ళు కూడా నిండుగా శరీరాన్ని కప్పుకోరు. జాకెట్లు వేసుకోరు. అన్నీ మూఢనమ్మకాలే. తుమ్మితే తప్పు. దగ్గితే తప్పు. గుడ్డి బతుకు. జీవితంలో ఆనందమంటే వీళ్ళకి తెలుసునా అనిపించింది. ఒత్తి అనాగరికపు మనుషులు అనుకునేవాడు వాళ్ళ గురించి బసవరాజా.

సుమారు మూడునెలల క్రితం బసవరాజా ఆ వూళ్ళో అప్పర్ ప్రయిమరీ స్కూల్ తెరవడం కోసం వచ్చినప్పుడు—మొదటిరోజునే తన కమ్యూ నిష్టు స్నేహితునికి ఒక ఉత్తరం రాసాడు. ఈ వూరి నిండా అజ్ఞానమనే బురద. సంస్కార హీనమనే దుర్గంధం. పేదరికం అనబడే కుష్టురోగం. జమీం దారీ విధానం వలన ఏర్పడ్డ వ్యభిచారం. అసలు ఇక్కడ మనుష్యులు పూర్వతరాలకి చెందినవాళ్ళూ కారు ఈ తరానికి చెందినవాళ్ళూ కారు. నిజంగా భయ మేస్తోంది. కాని ఇట్లాంటి దగ్గర ఏమేనా మార్పు సాధించగలనేమో చూస్తాను. ఇక్కడ ఈ ప్రజల్లో కొత్త చైతన్యాన్ని మేల్కొల్పగలిగితే—నాకు నూటా ఏభైమంది పిల్లలు ఆసరాగా ఉన్నారు. వాళ్ళు నాకు ఆయుధాలు. ఆ ఆయుధాలనే ఉపయోగిస్తాను ఈ వూరు మీద' అని.

తర్వాత బసవరాజా అంటే చాలా మంచివాడు అని వూర్లో అందరికీ తెలిసింది. మొదట్లో బసవ రాజా కమ్యూనిష్టు అని అన్నప్పటికి తర్వాతర్వాత బసవరాజా ఏ ఇస్టూ కాడు అనుకున్నారు. అతడికి రష్యా కంటే అమెరికా అంటేనే ఎక్కువ ఇష్టం అని తెలుసుకున్నారు.

మరొకసారి ఓ నెల దినాలు గడచిన తర్వాత బసవ రాజా ఒక రచయిత మిత్రునికి ఉత్తరం రాస్తూ 'ఈ వూర్లో రాజకీయాలున్నాయి. కమ్యూనిస్టుల కొడవలీ సుత్తీ ఎర్రజండాలు మనకి కన్పిస్తాయి. కాంగ్రెసు జోడెద్దుల కిందటి ఎలక్షన్ల గుర్తులు యింకా గోడల మీద కన్పిస్తూనే ఉన్నాయి. సమితి సర్పంచ్ కాంగ్రెసేనట. స్వతంత్రపార్టీ కూడా ఉంది. పంచాయితీ బోర్డు మాత్రం స్వతంత్రపార్టీ ఆధీ నంలో ఉంది. నీలం ఆకాశంలో ఒంటరి నక్షత్రం మిణుకు మిణుకు మంటోంది. వీళ్ళు తెలివి తక్కు వ్వాళ్ళు అనుకున్నాను గాని అబ్బో మనలాంటి వాళ్ళని వేలంవేసి అమ్మేయగలరు. ఇక్కడ మొన్నో కథ విన్నాను. క్విట్ ఇండియా తిరుగుబాటు రోజుల్లో రంగా నాయకత్వాన చిన్నచిన్న రాజాలవీ, మొఖాసా దారులవీ, జమీందారులవీ పధ్నాలుగు కోటలు ఒకే రాత్రి కాల్చారు. ఆ తిరుగుబాటులో పాల్గొన్నాయన వాళ్ళబ్బాయి స్కాలర్షిప్ కోసం వచ్చి చెప్పాడు. మనకంటే మన ముందుతరాల వాళ్ళే నయం. చాలా కష్టాలని ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఆయన ఆ విప్ల వం గురించి చెపుతోంటే 'ఎంత అదృష్టవంతుడు!' అనిపించింది' అని రాశాడు.

బసవరాజుని చూట్టానికి ఆ దగ్గర్లో ఓ హై స్కూల్లో పనిచేస్తున్న ఓ మిత్రుడు, హిందీమేష్టరు, వస్తే 'ఈయన పెద్ద రైతుగారబ్బాయి. ఇంటర్మీడి యట్ చదువుకున్నారు. మనకి ఈ వూర్లో ఈయన్ద గ్గరే తెలుగు దినపత్రిక దొరుకుతుంది. పేరు చెప్పడం మరచాను. కోదండపాణిగారు.' అని పరిచయం చేసిన తర్వాత 'చదువుకున్న వాళ్ళు ఎస్సెస్సెల్సీ వరకూ ఓ పాతికమంది వరకూ ఉన్నారు. కాని ఏం లాభం? కనీసం దినపత్రిక కూడా చదవరు. దేశంలో ఏం జరుగుతుందో తెలీదు. వాళ్ళ చదువు పిచ్చివాడి చేతి లోని రాయిలా తయారయింది' అన్నాడు.

అవూర్లో ఆ చదువుకున్న కొద్దిమందికీ బసవరాజా తెలివితేటలు గలవాడు అనిపించింది. స్కూల్లో పిల్లలకి కొత్త హెడ్మాష్టరు వచ్చిన తర్వాత ఆటలూ, చదువులూ ఎక్కువయ్యా యనిపించింది. వూర్లో వాళ్ళందరికీ స్కూలు కళకళ్ళాడుతోందనిపించింది.

ఒక సెలవు రోజు వూర్లో వున్న మంచిదనబడే ఒక టీకొట్టు బెంచీల మీద కూచున్న పదిమంది గ్రామస్థుల మధ్య కూచుని తనకి తెన్నేటి విశ్వ నాథమూ, వావిలాల గోపాలకృష్ణయ్యా, పుచ్చలపల్లి సుందరయ్యా, గౌతు లచ్చన్నా, ఇంకా కాంగ్రెస్ మినిష్టర్లూ తెలుసని చెప్పాడు బసవరాజా. ఆపేర్లు చెపుతోంటే ఒకాయన 'నెహ్రూగారిని చూసారా?' అని అడిగాడు. అప్పుడు బసవరాజా తన దగ్గరున్న ఆటోగ్రాఫ్ పుస్తకం గురించి చెపుతూ రాజాజీ, హీరేన్ ముఖర్జీ, జయప్రకాష్నారాయణ, మొరార్జీ, లోహియా, మీనన్, వాజ్పాయ్, వినోబా, డాంగే మొదలయిన నాయకుల పేర్లు చాలా చెప్పాడు. విదేశ రాజకీయ నాయకులని కూడా చాలామందిని చూసా డట! అక్కడున్న వాళ్ళ కెవ్వరికీ రచయితలంటే అర్థం కాలేదు కాని తెలుగు రచయితలు విశ్వనాథ, శ్రీశ్రీ, గోపీచందూ, చలం, కొడవటిగంటి, ఆరుద్ర, జంధ్యాల పాపయ్యశాస్త్రి, నారాయణరెడ్డి—వాళ్ళం దరూ తనకి తెలుసుననీ, చూసాననీ చెప్పినప్పుడు మట్టి తాగుతున్న ఓ ఇరవై యేళ్ళ కుర్రాడు 'మేష్టరూ, నాగేస్రావుని చూసినావా?' అని అడిగాడు. సినిమాల గురించీ, స్టూడియోల గురించి

ఈ తంతు అంతా అనుకునేవాడు బసవరాజు. కాని ఈరోజు—

బసవరాజు 'తను మంచివాడు' అనే స్వీయాభిప్రాయం ఉంది. వాళ్ళ నాన్నగారు ఒక హైస్కూల్లో హెడ్మాష్టరు. ఆయనకి రాజకీయాలంటే ఇష్టం. వాళ్ళమ్మగారు బాగా చదువుకున్నామె. యూనివర్శిటీ డిగ్రీలు లేవామెకు. కాని సంగీతం, సాహిత్యం ఆమెకి బాగా ఇష్టం. బాగా పాడతారామె. తలిదండ్రుల సంస్కారంతో అతడు చిన్నప్పటి నించీ మంచిగానే పెరిగాడు. మంచివాడుగా గుర్తింపబడ్డాడు. అతడు కాలేజీలో చదువుతున్న రోజుల్లో ఎవరో గోపరాజు రామచంద్రరావు గురించి చెప్పారు. గోరాకీ గాంధీజీకి జరిగిన వాద ప్రతివాదాల గురించి చెప్పారు. ఆయన్ని చూడాలనిపించింది. చూసాడు. చార్వాకుడి గురించి ఒక ప్రొఫసర్ చెప్పాడు కాలేజీలో. విన్నాడు. పాశ్చాత్య జీవితం గురించి చదివాడు. పాశ్చాత్యులు పారిశ్రామికంగా, వైజ్ఞానికంగా చాలా అభివృద్ధి పొందారనిపించింది. అమెరికాలా తమ దేశం గొప్పదవాలనుకున్నాడు.

బసవరాజు చాలా నిచ్చెనల సెక్కి పై అంతస్థు మీద ఉన్నాననుకున్నాడు. మూఢనమ్మకాలతో, ఆలోచనా రహితమైన జ్ఞానంతో, పశువులా బ్రతికిన రోజుల గురించి స్మరించుకునేవాడు. ఆ రోజులన్నీ దుర్వినియోగమైపోయాయని బాధ కలిగింది. గౌరీ పౌర్ణమి వెన్నెల రాత్రులు వూళ్ళో జరిగే ఉత్సవాల్లో, వినోదాల్లో వేషాలు వేసి పాటలు పాడి అతడు పాల్గొన్నాడు. దీపావళి రాత్రి కోసం బాణసంచా తయారు చేసుకుని చీకటి ఎప్పుడు పడుతుందా అని నరకుణ్ణి చంపిన సంతోషాన్ని ఎంత తొందరగా పంచుకోవడమా అని చీకటి కోసం ఎదురు చూసేవాడు. కార్తీక మాసంలో వేకువ జామునే లేచి నది ఒడ్డుకి అరటి దొన్నెల్లో దీపాలు ఉంచి, ప్రవాహంలో అవి వందలాది పోతో వుంటే ఆకాశంలో మెరుస్తున్న నక్షత్రాలని చూసుకుని చీకట్లో నది

## బాపు

నడక సవ్వడి విని ఆ చీకట్లో ఆ చలిలో ప్రవహిస్తున్న నీటిలో స్నానం చేసి తడిగుడ్డలతో ఇంటికి వచ్చేవాడు. మాఘమాసంలో వణికే చలిలో, అక్కలతో, ఇరుగు పొరుగు పిల్లలతో వెళ్ళి మునిగి చీకటిలో చెట్ల, చుక్కల, ఆకాశంలోని మేఘాల అందాలు కళ్ళార్పకుండా చూసి వచ్చేవాడు. సంక్రాంతి నెల అర్ధరాత్రే లేచి మంటలేసుకుని జ్వాలల నృత్యం చూస్తుకుంటూ పరవశించిపోయి, కోడి కూతలు విని, విచ్చుకున్న పూల మీది మంచు బిందువుల తళుకు చూసి ఆనందించేవాడు. శివరాత్రి పూట జాగరం చేసి, దేవాలయాల్లో హరికథలూ, భాగవతాలూ చూసి వేకువనే స్నానాలు చేసి, పూజలు చేసి, దేవుని దగ్గర కొబ్బరి కాయలు కొట్టి ప్రసాదం తిని పగలంతా నిద్రపోయి పండగ కోసం మళ్ళీ నిరీక్షించేవాడు. శ్రీరామనవమి పండుగ దినాలన్నీ రాత్రులు ఎంతో హాయిగా, ఆనందంగా వుండేవి. ఎన్ని రకాల వింతలు! చల్లని హాయి గొలిపే గాలిలో మనుషుల రాపిడితో నడవడం ఎంతో బాగా ఉండేది. గ్రహణం రోజున సముద్రానికి పోయి కెరటాలతో ఆడుకుని, ఆ కెరటాల మీది రంగుల నృత్యం చూసి వచ్చేవాడు. తులసి కోటలోని పరిమళాల మొక్కని పూజించటం, నాగుల చవితికి పుట్టల్లో పాలు పోయడం, మర్రిచెట్టు క్రింద త్రినాథవ్రతం చెయ్యడం, పెద్దలతో సింహాచలం, ముఖలింగం, అరసవెల్లి, శ్రీ కూర్మం యాత్రలకి వెళ్ళాలని పట్టుదల పట్టి, ఏడ్చి గెలుచుకోవడం, కనుము నాడు ఆవులనీ, గేదెలనీ, ఎడ్లనీ పూజించటం అవన్నీ ఒకప్పుడు చాలా గొప్పగా ఉన్నప్పటికీ ఇప్పుడు అర్థంలేని ఛాందసాలుగా అనిపించాయి 'భారతీయ జీవిత విధానం ప్రకృతి సౌందర్యంతో తాదాత్మ్యం పొంది ఆధ్యాత్మిక అనుభూతి పొందడం, ఇంత ఉత్కృష్ట జీవిత విధానాన్ని ప్రపంచంలో ఏజాతీ అభివృద్ధి చేసుకోలేదు' అని ఒకసారి ఒకాయన అంటే వెంటనే బసవరాజు "పశువులు ఈ ప్రపంచ సుఖదుఃఖాలకి నిర్వికల్పంగా, అతీతంగా ఉంటాయని వాటిని ఋషులు అన్నట్టుంది మీ ధోరణి' అని ఖండించాడు. 'ఏం ఎందుకు ఎద్దు మాంసం తినకూడదు? మనదేశ సమస్యలు, ప్రపంచంలో మన సమస్యలు, ప్రపంచంలో మనదేశ గౌరవమూ, మన ప్రజల ఆరోగ్యమూ కంటే సనాతన మూఢనమ్మకమే పవిత్ర మయిందన్నమాట!' అని బాధపడేవాడు.

బసవరాజు కొత్త ప్రపంచం గురించి తెలుసుకున్న తర్వాత, ఇంగ్లీషు పుస్తకాలు చదువుకున్న తర్వాత, జీవితం గురించి భౌతికంగా, హేతుబద్ధంగా ఆలోచించడం మొదలుపెట్టిన తర్వాత పెరిగాడనుకున్నాడు. తనకి మంచి చూపు వచ్చిందనుకున్నాడు. తను మనిషిలాగ బ్రతుకుతున్నాడనుకున్నాడు. తను బాగుపడ్డాడనుకున్నాడు.

అతడి కొత్తచూపు, అతడి మంచి, అతడి బాగు, అతడి ప్రగతి ఒక్కమాటలో, స్త్రీ యవ్వనం దగ్గర, ఒక్క నిమిషంలో మంట గలిసిపోయిన స్థితి గుర్తుకొచ్చింది. ఎంత తప్పయిపోయింది. ఇప్పుడెలా లోకాన్ని చూడడం?

ఆ రాత్రి ఒక్కడూ ఆగదిలో బసవరాజు కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు.

బసవరాజుకి ఆ అమ్మాయి గుర్తుకొచ్చింది. ఆ అమ్మాయి పదహారేళ్ళది. తేనెరంగు శరీరం. అందం కంటే ఆరోగ్యం ఎక్కువ. ఆమె చూపులకి ఆమె నడకకి ఎక్కువ అందముంది. కొండలోయల్లో, చెట్ల నీడల్లో, ప్రవాహానికి ఉన్న అందం ఆమెది. ఆ అందానికి, ఆ చూపులకి, ఆ నడకకి, తన తెలివితక్కువ తనానికి, భ్రమకి, తొందరపాటుకి, ఉద్రేకానికి, తనకి తల్లితండ్రీ యిచ్చిన ఆరోగ్యాన్ని, కుటుంబ మిచ్చిన మంచినీ, జీవిత పరిసరాలిచ్చిన ఆత్మబలాన్ని, అనుభవాలిచ్చిన ధైర్యాన్ని, సంస్కారాన్ని, కర్మణ్యతనీ—బలిచ్చాడు.

అంత మంచి అమ్మాయి జీవితం మీద, పెళ్ళయిన ఆ అమ్మాయి జీవితం మీద యింతటి మసిపులిమేసాడు. ఆమె నిర్మల జీవితం మీద బురద చిమ్మాడు. ఆమె అమాయికత మీద నిప్పులు కురిపించాడు. ఎంత తెలివితక్కువ పని జరిగింది.

ఒక సామాన్యమైన పదహారేళ్ళ పిల్ల చూపులని అంత తప్పుగా, వక్రంగా అర్థం చేసుకున్న తను ప్రపంచంలోని దేన్ని నిజంగా, వాస్తవంగా అర్థం చేసుకున్నట్టు? ఏం అర్థమయినట్టు? అలా ఆలోచించగా బసవరాజుకి ప్రపంచం ఏమీ అర్థంకానట్టు, ప్రపంచానికి ఏమీ అర్థం లేనట్టూ బోధపడింది. అతడికి ఎందుకని తల్లి తమ్ముడంటే ఎక్కువ మమకారం చూపిస్తుందో అర్థం కాలేదు. అక్క 'నీగురించాకేం బోధపడదురా' అని ఎందుకంటుందో అర్థం కాలేదు. నాన్న తమ్ముళ్ళతో చెప్పినట్టుగా తనకెందుకు ఏ విషయమూ చెప్పడో అర్థం కాలేదు. చెల్లెలు 'నువ్వా, వదినొస్తేనా — మమ్మల్ని మరచిపోతావన్నయ్యా' అని ఏ దురభిప్రాయంతో అంటుందో కూడా అర్థం కాలేదు.

బసవరాజుకి సైన్సు చూపించిన అనంత విశ్వమంతా కనబడింది. కోట్లకోట్ల నక్షత్రాలు. ఆ నక్షత్రాల్లో అతి చిన్న—అతి చిన్ననక్షత్రం సూర్యుడు. ఆ సూర్యుని చుట్టూ చిన్న చిన్నటి గ్రహాలు.. ఆ గ్రహాల్లో ఒక చిన్నగ్రహం భూమి. ఆ భూమి మీద



